


తెలకపల్లి రవి

# బల్లి

***బల్లులు!***

***గోడలకు, కిటికీలకు, మంచానికి అన్నిటికి వేలాడుతు-***

***పెద్దవి, చిన్నవి, నల్లవి, తెల్లవి, ముసలివి, చిన్నవి, బుల్లివి, ముదురువి***

***రకరకాల సైజుల్లో, వికారంగా, భయంకరంగా***

***రూమంతా బల్లుల సముద్రంలా వుంది.***

ఏమీ తోచడంలేదు, అసలక్కడకెందుకు, ఎలా వచ్చానో కూడా పాలుపోవడం లేద.

బాత్‌రూంలో బల్లి వుంది వెళ్లనన్నా వినిపించుకోకుండా పంపించిన అమ్మ మీద బోలెడు కోపం.

అయినా బాత్‌రూంలో వుండేది ఒకే ముసలి బల్లి కదా. ఇన్ని ఎలా వచ్చాయి?

అరే, ఇది బాత్‌రూం కాదు కదా, నా బెడ్‌రూమే!

దీన్ని మొత్తం ఇన్ని బల్లులు ఆక్రమించేశాయ్!

ఇక నేనెలా వుండగలను? వుండకపోతే ఎక్కడికి పోవాలి?

మరో ఇల్లు చూసుకోవాలేమో!

అక్కడ మాత్రం బల్లులుండవని గ్యారంటీ ఏముంది?

ఇందుగలదందులేదని సందేహము వలదు, బల్లి సర్వోపహతంబు, ఎందెందు కాలుమోపిన అందందే గలదు..

బల్లి భాగవతం రాస్తే?

ఏమిటో ఈరోజు ఇలా ఐడియాలు తన్నుకొచ్చేస్తున్నాయి!

రాయాల్సిందే, బల్లి భాగవతం. పూతన కాదు కాదు పోతన బాబులా రాయాల్సిందే.

పోతనలా రాయాలంటే ఘంటంకావాలి... తాటాకులు కావాలి.

అరే ఇక్కడే అన్ని రెడీగా వున్నాయే!

ఇంకా లేటెందుకు కవీ, లెటజ్ స్టార్ట్!

ఇదేమిటి? ఆదిలోనే హంసపాదులా ఎవరు? మదీయ ఏకాగ్ర రచనా తపస్సుకు భంగం కలిగించువారెవ్వరు? ఓయీ మీరలెవ్వరు? ఇట్లు తపోభంగము కలిగించుటకు కారణమేది?

ఏదో గట్టిగా అరవాలనుకున్నా గొంతు పెగలడంలేదే!

అరే అసలు బల్లులన్ని ఏమైపోయాయి?

నేను వాటి గురించి భాగవతం రాస్తున్నానని సంతోషించి అదృశ్యమయ్యాయా?

హమ్మయ్య. మళ్లీ ఇంతలోనే ఈ ఉపద్రవం ఏమిటి? ఎవరు ఇంత గట్టిగా కుదుపుతున్నారు?

..... నిద్ర పోనివ్వరే!

..........

లాభం లేదు. టైము ఎనిమిదైంది. ఇంతసేపు మొద్దులా నిద్రపోవలసింది కాదు. తొమ్మిది గంటలకు వస్తానని చెప్పాను. స్పీడుగా తయారవ్వాలి.

అంతకంటే స్పీడుగా వెళ్లాలి. నిద్రలేస్తే వెళ్లాల్సిందే.

జీవితంలో అత్యంత క్రమశిక్షణగా చేసే ఒకే పని ఇదేనా? అది మన ప్రమేయం లేనిది కదా. అక్కడ ఖాళీలేదు. పక్కన ట్రై చెయ్యి. అటాచ్డ్ బాత్‌రూమ్స్ కట్టుకుంటిమి కదా. ఔను. మనం ఎంతో దూరదృష్టితో వ్యవహరించి...

సరే, స్వడబ్బా తగ్గించి పోదాం పదా

పోయెదము. చిన్నప్పటి నుంచి ఈ విషయంలో మాత్రం తేడా రానివ్వలేదే.

ఉదయముననే నిద్ర లేచితిని. కాలకృత్యములు తీర్చుకుంటిని. కాలకృత్యములనగానేమి? ఏమున్నాయి? పళ్లు తోముకోవడం, స్నానం చేయడం.

ఇంకా ఏముంటాయి? అన్నీ చెప్పుకోవాలా? సినిమాల్లో కూడా చూపిస్తుంటే నీకెందుకు బెరుకు? చెప్పెయ్యి.

చెప్పాలని వుంది. దేవతయే దిగి వచ్చి మనుషులలో కలసిన కథ చెప్పాలని వుంది.

బాత్‌రూంలో దేవత పాట. అయినా ఎన్టీ రామారావు కాలం నాటి పాటలు ఎవరికి కావాలి గురుడా!

కమ్ టు ద ప్రెజంట్. వర్తమానపుటావర్తంలో కిరా...

పచ్చెదను. వచ్చెదను. వర్తమానం ఏం కర్మ, విజన్ ట్వెంటీ ట్వెంటీ లా వందేళ్ల ముందుకు చూచెదను. అందుకే కదా ఈరోజు తొమ్మిది గంటలకు అపాయింట్‌మెంట్.

అపాయింట్‌మెంట్! ఇద్దరు పిచ్చిసన్నాసులు బస్టాప్‌లో కలసి ఇరానీ హోటల్‌లో చాయ్ తాగి చచ్చు కబుర్లు చెప్పుకునే మహత్తర కార్యక్రమానికి పేద్ద బిల్డప్.

ఒరే ఆత్మారాముడూ, నీవు మరీ పేట్రేగిపోతున్నావు.

సుదీర్ఘ ప్రస్థానం కూడా చిన్న అడుగుతోనే ప్రారంభమవుతుంది. బిందువులు చేరిన సింధువగును.

చాలు బాబూ సూక్తి ముక్తావళి. పర్సనాలిటి డెవలప్‌మెంట్ బుక్కుల్లో చదవలేక చస్తున్నాం.

అవన్నీ పర్సనాల్టి డెవలప్‌మెంట్ కాదొరే, పర్సనల్ డెవలప్‌మెంట్ కోసమే. సెల్ఫ్ డెవలప్‌మెంట్ కాదు, షెల్ఫ్ డెవలప్‌మెంట్ అనలేదా మన ఫ్రెండు.

ఏదో ఒక డెవలప్‌మెంట్. చకచకా స్నానం చేసి వెళ్లి వాన్ని కలుసుకుని మల్టీమీడియా విజువలైజేషన్ ప్లాన్ రెడీ చేయాలి.

కమాన్ క్విక్. పళ్ళు చకచక తోమి, సబ్బు బరబర రుద్ది... రెడీ, రెడీ, రెడీ, ఎవరెడీ బ్యాటరీ, ఎవరెడీ పుల్లారెడ్డి అన్నదమ్ములై వుంటారా?

అయినా పుల్లారెడ్డి మిఠాయిలు తియ్యగా చేస్తాడనుకుంటే అలా మాట్లాడ్డేమిటి చెప్మా?

చెప్మా ఏమిటి ఉప్మాలా అసహ్యంగా. ఇతర ప్రాంతాల వారి ఈ ఊత పదాలు మార్చుకోలేవా! అన్ని ఎరువు పదాలు బరువు చేటు అని ఎరగవా!

ఎరిగితిని. ఎరిగితిని. అన్నిసార్లు అనొద్దు బ్రదర్. దీర్ఘాలు తప్పొస్తే కొంప మునుగుతుంది.

అయినా తప్పు రావడమేమిటి! మన దగ్గర. అవధానుల వారి ఆడపడుచును శాస్త్రుల్లవారు కోడలిని లవణం అంటే గోమయం కాదా అని వెనకటికావిడ ఆవుపేడ తెచ్చి వేసిన చందమున...

సరే సామెతే ఎక్స్‌ట్రా అనుకుంటే సమగ్ర కథనం గుర్తు చేసుకోవాలా

వద్దు. పని చూడు. పని చూడు. కమాన్ స్నాన్. స్నాన్. తెలుగును ఇంగ్లీషులో మార్చి ఇలా ఎన్ని పదాలు సృష్టించాం. ఎవరు పట్టించుకున్నారు. మొన్న ఏదో సినిమాలో పెట్టేసరికి అదే పెద్ద గొప్పయిపోయింది. అంతే అంతే. మాటకైనా పాటకైనా మనిషికైనా సరుకుకైనా పబ్లిసిటీయే

ప్రాణము. ప్రాణము.

ఆ రహస్యం కనుక్కోబట్టే కదా ఈరోజు అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకుంది. చాన్సు తగిలితే ఈ దెబ్బతోటి మన కరువు తీరవచ్చు. పోతే? (వెధవ డౌట్లు నువ్వూ) అనుభవమ్ము వచ్చు! వస్తుంది, వస్తుంది, ఇలాగే సాహిత్య వేదాంత సామాజిక భావలహరిలో మునిగి తేలుతుంటే రాత్రి వస్తుంది. తొందర పడు బ్రదర్.

ఓకే. ఇక స్పీడు పెంచేస్తాను. అసలు నేను మా మూలుగా అన్ని వేగంగానే చేస్తానని అందరూ అంటుంటారు. అందరూ అంటే? అమ్మ, తను.

తను ఎవరా తను? ఎవరాతను?

అందరూ అన్నా ఎవరూ అన్నా నిజానికి వారే కదా. అదే కదా భాషలో తమాషా. చేరా మాష్టారుగారినో బూదరాజునో అడిగెయ్యాలి. అయినా వారిని అడగమేమిటి? మనమే స్టడీ చేయలేమా? గలము. గలుగుదుము.

ఇలాగే ఎటు పడితే అటు కొట్టుకుపోబట్టే కదా తాడూ బొంగరం లేకుండా ఇలా అయ్యాం. ఇప్పటికన్నా బుద్ధి రాకుండా మళ్లీ పేద్దపేద్ద ప్లానులు హవ్వ హవ్వ.

ఇదే వచ్చిన సమస్య. మనమీద మనకు విశ్వాసం లేదే. మన గొప్పతనం మనకు తెలియదే. ఆత్మన్యూనతా భావం అహంకారంకన్నా ప్రమాదకరమని అనలేదా సి.నరసింహారావు, పట్టాభిరామ్, యండమూరి పేరు మరచితివా! ఎందుకు మరచెదను. నవలలు రాయడం మానేసి ఇలాటివి తెగరాస్తుంటే ఏదో సామెత వుంది కదా. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు, రచయిత పర్సనాలిటీ డెవలపర్ అయ్యేదరా. ఈ సామెత కంటే ఇంకోటి దగ్గరగా వుంటుంది. వృద్ధనారీ... వద్దు వద్దు... స్త్రీలను కించపరచే సామెతలకు స్వస్తి.

ఆ గొడవ మనకెందుకు, మన సంగతి చూసుకోవాలి. మన మీడియా ప్లాన్‌లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పార్టండ్ పార్సల్‌గా వుండాలి మరి.

భాగంగా అనుకోవచ్చు కదా. వీల్లేదు. మనం మాడ్రన్ కదా.

మాడ్రన్ ప్లాన్ వేద్దాం. వేద్దాం. తొందరగా స్నానం చేద్దాం, చేద్దాం.

అరే ఇంతసేపూ పట్టించుకోలేదే, బల్లి సరిగ్గా నెత్తి మీద పడేలా వుండే అమ్మో

ఆరోజు కూడా ఇలాగే చచ్చిన బల్లి కుర్చీ వెనక పడితే తను చూపించింది. మొన్న వంటింట్లో తలుపుల మధ్య చచ్చిపోయిన బల్లిని చూసి ఒక రోజంతా ???? తను. మళ్లీ తను... ఎవరా తను?

ఆ సంగతి తర్వాత. ముందు బల్లి సంగతి చూడు. పట్టు జారి నెత్తినపడితే.

పడదు. బల్లి అలా ఎంతకాలమైనా అతుక్కొని వుంటుంది. దాని శరీర నిర్మాణమే అంత. చిన్నప్పటి నుంచి ఎన్నివందలసార్లు చూల్లేదు. అయినా పొరపాటున పడితే?

.......

లాభం లేదు. ఇది పోయేలా లేదు. మనసంతా పాడైపోతుంది. బల్లిని చూస్తేనే అసహ్యం. కాదు ఆందోళన అంటాడు వాసు. ఏదో ఒకటి. చూడ్డానికి అసహ్యంగా అదేమిటో... ఎప్పుడూ పాకుతూ చూస్తు చ!

అసలు ఇలా అతుక్కుని వుండటం పాకడం

**అరే ఇంతసేపూ పట్టించుకోలేదే, బల్లి సరిగ్గా నెత్తి మీద పడేలా వుండే అమ్మో ఆరోజు కూడా ఇలాగే చచ్చిన బల్లి కుర్చీ వెనక పడితే తను చూపించింది. మొన్న వంటింట్లో తలుపుల మధ్య చచ్చిపోయిన బల్లిని చూసి ఒక రోజంతా ???? తను. మళ్లీ తను... ఎవరా తను?**

**ఆ సంగతి తర్వాత. ముందు బల్లి సంగతి చూడు. పట్టు జారి నెత్తినపడితే.**

అంటేనే చికాకు. ఆఫీసులో రామస్వామీ అంతే. ఎప్పుడూ అడుగులో అడుగు వేసుకుంటూ ఏదీ తేల్చి చెప్పకుండా నసపెడుతూ యమ చికాకు. ఎప్పుడు పడిపోతాడా అన్నట్లు. కాని పడిపోలేదే! అందరికీ అన్ని చేసిపెడుతూ అలా అలా గడిపేస్తుంటాడే. ఏం చేశాడు పెద్ద. ఆఫీసు సర్దుతాడు. అడిగినవి తెచ్చిస్తాడు. కాని ఫాస్ట్‌నెస్ ఏదీ? ఫాస్ట్ అనుకున్నవాళ్లు మాత్రం ఏం చేశారు? నెత్తిన చేయి పెట్టి ఉడాయించారు. అంతకంటే రామస్వామే మేలు కదా. అదే పొరబాటు. దేనికదే. జీవితంలో వేగం వుండాలి. ఎప్పుడూ పాకుతూ వుండేవారు ఏం చేస్తారు? ఈ బల్లిలా... అది మాత్రం ఏం చేసింది? దాని మానాన అది వుంది. ఇంట్లో పురుగులు పుట్రా తినేసి శుభ్రం చేస్తుంది. బల్లిలేని ఇల్లు పురుగుల మయమని సైన్సు చెప్పలేదా? ఎందుకు చెప్ప లేదు. చాలా చెప్తుంది. దానికేం చిన్నప్పటి నుంచి భయపెడుతూనే వుంది ఈ పాడు బల్లి. ఎప్పుడూ భయానకంగా...

అయినా అదేం చేసింది? ఎప్పుడైనా మీద పడిందా? పడినప్పుడైనా కుట్టిందా? కొరికిందా? ఏం లేదే! అయినా భయం భయం... ఎందుకురా ఎందుకు? పులి తినేస్తుంది. పాము కాటేస్తుంది. ఆఖరుకు చిన్న చీమ కూడా కుట్టి బాధపెడుతుంది. కాని బల్లి ఏం చేయదే? దాన్ని చూసి ఎందుకు భయపడుతున్నట్లు? భయం నీలో వుందా బల్లిలో వుందా?


ఈ ప్రశ్నలు, జవాబుల కార్యక్రమం ఇంకా ఎంతసేపు. అవతల

ఈ బోడి అపాయింట్‌మెంటా. అక్కడ నీ నెత్తి మీద ఎవరు చేయి పెడతారో తెలియదు. ఏం జరగబోయేది తెలియదు. మీ ఆఫీసు వుండేది తెలియదు. మూతపడేది తెలియదు. అసలు నీకేది తెలియదు. పులులు, పాముల్లాంటి సమస్యలన్నిటికి భయపడ్డం మానేసి బల్లికి భయపడుతూ కూర్చోడమేమిటి?

అయినా వాటికి భయమెందుకు, భయపడినా చేసేదేముంది? జరిగేది ఎలాగూ జరుగుతుంది.

మరి అంత పెద్ద సమస్యలనే వదిలేసి బల్లికెందుకు భయపడటం?

మన చుట్టూ తిరుగుతూ మనకెలాంటి ఆపద



కలిగించకుండా కనిపెట్టుకుని వుండే బల్లిని బలిచక్రవర్తిని ఎందుకురా మనం అంత ఆందోళనగా చూట్టం?

ఆత్మారాముడి ప్రశ్నలో ఆంతర్యం చాలానే వుంది. బలి చేసే వాళ్లను వదలిపెట్టి బలహీనులకెందుకురా భయపడటం?

ఆత్మారాముడి గొంతు పెరిగినట్టుందే!

వింటున్నానులే... నీ మాట తెలుస్తూనే వుంది.

ఏం తెలుస్తుంది నీ బొంద, తెలిస్తే ఇంకా భయపడటమెందుకు

లేదు భయంలేదు. భయమ్ములేదురా జంకుగొంకు లేక బల్లి దోస్తు చెయ్యరా

కాని ఏదీ అది?

పై నుంచి పాకిపోయిందే! అయినా నాకేమీ కాలేదు.

స్కాన్ స్కాన్ క్విక్? క్విక్... నోనో

నా బల్లి ఎటు పోయిందో తెలిసేవరకూ పచ్చి మంచి నీళ్లు కూడా ముట్టను (పోనీ మినరల్ వాటర్... ఏమిటీ అసందర్భ హాస్యము) నిను చూడక నేనుండలేను ఆహా ఆహా పాటలు భలే సెట్ అవుతున్నాయే. కాని నీవెక్కడ వుంటివే భల్లూకమా (అన్నట్టు అమ్మ బల్లిని అలా పిలిచేది కదా... నా భయం పోగొట్టడానికి బల్లిని అవలీలగా చంపేసి చూపించేది కదా)

అవును. ఆ అమ్మ ధైర్యం నాలో లేదా? వుంది. వుందని నిరూపించుకుంటాను. కాని బల్లిని చంపను. చంపకుండా ఏం చేస్తాను? ఏమో కనిపిస్తే కదా.

హమ్మయ్య కనిపించింది. అదిగో బాత్‌రూం జాలీకి అటు వైపు నుంచి కనిపిస్తోంది.

దాని శరీరం ఇవతలి వైపుకు తెల్లగా... ఛఛ అయినా అంత అసహ్యం అనిపించలేదే...

పోపో చప్పుడు చేసినా పోవడంలేదే... కదిలింది. కదిలింది. వెళ్లిపోయేట్టుంది. వద్దు వెళ్లొద్దు... నన్ను విడిచి వెళ్లొద్దు. బల్లీ తల్లీ వెళ్లకు మళ్లీ... నిన్నింతకాలం అపార్థం చేసుకున్నాను. అనవసరంగా భయపడ్డాను.

బల్లికి తెలిసిందా, నా భాష వచ్చేసిందా? ఔను, జాలీ ఇవతలి వైపు నుంచి బల్లిని ముట్టుకున్నాను. మొదట మెల్లమెల్లగానూ తర్వాత మనస్ఫూర్తిగానూ.

ఏదో కొత్త కోణం స్ఫురించినట్టుంది. ఏవో అదృశ్య, ఆదిమ భయాలు అంతరించినట్టు ఏదో ఫీలింగ్. నిన్నలేని అందమేదో నిదుర లేచెనెందుకో!

.....

హమ్మయ్య టైముంది

త్వరత్వరగా వెళ్లే అపాయింట్‌మెంట్.


బోడి అపాయింట్‌మెంటేనా?

ఏం కాదు. నా పని నాకు గొప్పే. నా భావాలు నాకు గొప్పే. వాటిని అనవసరంగా అసహ్యించుకున్నానే. తరతరాలుగా మనుషులు అసహ్యించుకుని ఆందోళన పడుతున్నా, తనను చూసి అనవసరంగా భయపడే మనుషులను చూసి నవ్వుకుంటూ ప్రశాంతంగా తన బతుకు బతికేస్తుందే బల్లి.. నాకేమిటి భయం! బతగ్గలను. ఔను. బల్లి భాగవతం రాస్తాను. కొత్త పద్ధతిలో కొత్త పాఠాలతో.. భయం బల్లిలోలేదు బాబులూ మీలోనే వుంది.

మళ్లీ మీడియా అపాయింట్‌మెంట్‌లో ఇదే ఫస్ట్ లెసన్... ఇదే విజన్.

టైము తక్కువైనా గమ్యం చేరుకోగలననే ధీమాతో బయటపడ్డాను.

# పరీక్షలంటే భయపడుతున్నారా?



పరీక్షలు దగ్గరికి వస్తున్నాయంటే అందరిలోనూ ఆరాటం పెరిగిపోతుంది. కొందరు పిల్లలతోపాటు తల్లిదండ్రులు కూడా భయపడుతుంటారు. కొందరు భయసందేహాలతోనే చదివినట్టు చేస్తారు. కానీ మనసు పెట్టి చదవరు. భయంతో ఎంతసేపు చదివినా ఫలితం మాత్రం ఎక్కువ వుండదు. అందుకే భయాల్ని అధిగమిస్తేనే పరీక్షలు సరిగా రాయగలరు. మరి ఎలా అంటారా?

* పరీక్షలకు ముందు మాత్రమే చదివేవారు ముఖ్యంగా భయపడతారు. కనుక ఈ అలవాటుకు స్వస్తి చెప్పాలి. ప్లాన్డ్‌గా చదవటం అలవరుచుకోవాలి.

* పరీక్షల్లో బాగా రాయగలమో లేదో అనే సందేహాలు అక్కర్లేదు. మీరు శ్రద్ధగా చదవడానికి ప్రయత్నించండి. విషయాల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలే తప్ప బట్టీ పట్టడానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు.

* పరీక్షల్లో తమకు అన్ని విషయాలు గుర్తుకు రావేమోనని కొందరు ముందునుంచే భయపడుతుంటారు. ఇది జ్ఞాపకశక్తికి సంబంధించిన భయం. పాఠ్యాంశాల్ని చదివి, సరిగ్గా అవగాహన చేసుకునేవారికి ఈ సమస్య ఉండదు. బట్టీపట్టేవారికే ఈ సమస్య వస్తుంది. కనుక విషయ అవగాహనకు ప్రయత్నిస్తే తమకు తోచిన భాషలో సమాధానం ఇవ్వడం సాధ్యం.

* మీరు మిత్రులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేస్తున్నప్పుడు ఆయా సబ్జెక్టుల్లోని ముఖ్యమైన పాయింట్స్‌ను చర్చిస్తే పరీక్ష రాసేటప్పుడు మీ ఫ్రెండుతో మాట్లాడిన విషయాలు గుర్తుకు వచ్చి జవాబు సరిగ్గా రాయగలరు.

* ముందుగా అన్నిరకాల భయాల్ని పక్కన పెట్టాలి. ఫస్ట్‌క్లాస్ వస్తుందో రాదో, ర్యాంకు వస్తుందో రాదోననే ఆందోళన అసలే కూడదు. ఫలితం గురించి ఆలోచించకుండా మీరు చక్కగా ప్లాన్ చేసుకొని చదవడానికి ప్రయత్నించాలి.

* అమ్మానాన్నలు పిల్లల్ని బాగా చదవమని ఒత్తిడి చేయకూడదు. పరీక్షలంటే భయం ఏర్పడేలా మాట్లాడకూడదు. వారు శ్రద్ధతో, అంకితభావంతో చదవడానికి మాత్రమే ప్రోత్సహించాలి.

* అన్నిటికీ మించి ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఇది తక్కువగా ఉన్నవారు రోజూ కొంతసేపు ధ్యానం చేయాలి. మెడిటేషన్ ద్వారా మనసును చిక్కబట్టుకొనే ప్రయత్నాలు చేయాలి.

* పరీక్షల్ని జీవిత పెను సమస్యల్లా చూసే దృష్టిని మార్చుకోండి. మీరు ఏడాదంతా చదివిన చదువును తెలుసుకోడానికి చేసే ప్రయత్నంగానే భావించాలి.

* మంచిమార్కులు తెచ్చుకోవాలని అందరికీ వుంటుంది. కానీ పరీక్షల ముందు అసలు టెన్షన్ లేకుండా, హైరానా పడకుండా సిద్ధం కావడం అన్నివిధాల శ్రేయస్కరం.